



బాలచంద్రుడి వేషధారణలో మంత్రి దుర్గేష్

చంద్రబాబుతో యనమల కరచాలనం

ఆదేశా.. కబడ్డీ

ముద్దుగా మన మహిళా నేతలు

హై..హై..నాయకా!

కూటమి నాయకులను ఒక వైపే చూశాం.. రెండో వైపు చూడలేదు.. గత మూడు రోజులుగా అదీ చూపించారు. అమరావతి కేంద్రంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లోనూ తమ సత్తా చాటారు. బుధవారం కబడ్డీ పోటీల్లో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నువ్వా నేనా అంటూ తలపడ్డారు. 60 ఏళ్లు పైబడిన కేటగిరీలో వంద మీటర్ల విభాగంలో తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. గురువారం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బాలచంద్రుడి ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి కొట్టేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కేరమ్స్‌లో ప్రథమ బహుమతి, టెన్నికాయిట్ డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచింది.



హలీమ్.. సలాం!

చూస్తే నోరూరుతోంది.. ఏడాదికి ఒక్కసారైనా తినాలనిపిస్తుంది.. ఎందుకంటే ముస్లింల వంటకం మరి.. ఆరోగ్యం.. బలమైన ఆహారం.. రంజాన్ మాసం సందర్భంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నగరాల్లో జనం ముందుకు వచ్చేసింది.. జనం కూడా ఎగబడుతున్నారు.. 15 రకాల మసాలాలతో తయారు చేసే హలీమ్‌కు సలామ్ కొడుతున్నారు..

6

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:23 (శుక్రవారం సాయంత్రం)
సహార్ : 4:45 (శనివారం ఉదయం)

స్మార్ట్.. వారికి 'స్పాట్'

- గగ్గోలు పెడుతున్న మీటర్ రీడర్స్
- తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్
- జిల్లావ్యాప్తంగా ఆందోళన బాట పట్టిన సిబ్బంది
- విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు





రామచంద్రపురంలో విద్యుత్ మీటర్ రీడర్స్ఆందోళన.. అమలాపురంలో గురువారం విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సాంకేతికత పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలకు గండిపడడం సహజమే. అలాంటిదే ఇప్పుడు స్మార్ట్ ఎలక్ట్రికల్ మీటర్ల రూపంలో వచ్చిందని దీనిపై ఆధారపడిన వారంతా గగ్గోలు పెడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో విద్యుత్ మీటర్ రీడర్స్‌గా పనిచేస్తున్న సిబ్బందికి స్మార్ట్ మీటర్ల వల్ల ఆ శాఖాధికారులు 'స్పాట్' పెడుతున్నారు. జిల్లాలో విద్యుత్ మీటర్ రీడర్స్‌గా వేలమంది సిబ్బంది పనిచేస్తూ రెండు దశాబ్దాలకు పైబడి ఉపాధి పొందుతున్నారు. అయితే ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ ఆధునికీకరణలో భాగంగా కేటగిరి-2 మీటర్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేస్తుండడంతో తమకు ఉపాధి కరువయ్యే ప్రమాదం ఉందని మీటర్ రీడర్స్ ఆందోళనబాట పట్టారు. వాస్తవానికి వీరంతా ప్రతీ నెల ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసి బిల్లులను వినియోగదారులకు అందిస్తారు. ఇందుకోసం విద్యుత్‌శాఖ ప్రత్యేక కాంట్రాక్టు పద్ధతిపై ఈ సిబ్బందిని నియమిస్తారు. ఒక్కొక్క మీటరుకు రూ.3 పైబడి మీటరు రీడింగ్ తీసే వ్యక్తికి కాంట్రాక్టరు చెల్లిస్తారు. ఒక్కొక్క రీడరు పరిధిలో 2 వేల నుంచి 2,500 మీటర్ల వరకు ఉంటాయి. వీరు నెలంతా కాలినడకన లేదా ద్విచక్ర వాహనంపై ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లుల మీటరు రీడింగ్‌తీసి వినియోగదారునికి అందిస్తారు. సుమారు 23 సంవత్సరాల నుంచి ఈ తరహాలో విద్యుత్ మీటర్ల బిల్లింగ్ కోసం జిల్లాలో వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో విద్యుత్‌శాఖ కేటగిరి-2 అంటే కమర్షియల్ మీటర్లకు స్మార్ట్ మీటర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే గ్రామ, మండల, పట్టణాల వారీగా ఈ విధానం అమలులో ఉండడం వల్ల ఒక్కొక్క మీటరు రీటరు పరిధిలో 5 నుంచి 800 వరకు విద్యుత్ కనెక్షన్లు కోల్పోయే పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రస్తుతం కేటగిరి-2కు అమలుచేస్తున్న విధానాన్ని రానున్న రోజుల్లో గృహాలకు కూడా అమలుచేస్తే ఈ బిల్లింగ్ విధానంపైనే ఆధారపడి జీవిస్తున్న వేల కుటుంబాల పరిస్థితి ఏమిటంటూ జిల్లావ్యాప్తంగా మీటర్ రీడర్స్ ప్రశ్నిస్తున్నారు. జిల్లా అంతటా వీరు ఆందోళనలు సాగిస్తున్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా ప్రాంతాల్లో ఉన్న విద్యుత్‌శాఖ అధికారులకు అందజేసినట్టు కోనసీమ జిల్లా ఏఐటీయూసీ అనుబంధ సంస్థలో ఉన్న స్పాట్ బిల్లింగ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.నాగబాబు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం అర్థం చేసుకుని తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలంటూ అధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ముఖ్యంగా తాము చేస్తున్న పనికి భద్రత కల్పించాలని, ఎలక్ట్రికల్ బిల్లింగ్‌లో కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి నేరుగా బిల్లులు రీడింగ్ చేసే వ్యక్తులకే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాటుచేయాలని, విద్యార్హతలు కలిగిన వారిని ఎలక్ట్రికల్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లతోపాటు వారిస్థాయికి తగ్గ ఉద్యోగాల్లో నియమించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలంటూ వీరంతా డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తక్షణం స్పందించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వ్యవహారంపై పునఃసమీక్షించడం లేదా వాటి నిర్వహణా బాధ్యత కూడా మీటర్ రీడర్స్‌కు అప్పగించాలని వారంతా ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.



సీఎం చంద్రబాబునాయుడుని కలిసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

శాసనసభ కమిటీల్లో బండారు, గిడ్డికి అవకాశం

అమలాపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన శాసనసభ కమిటీల్లో కోనసీమ జిల్లా నుంచి ఇద్దరు శాసనసభ్యులకు ప్రాతినిధ్యం లభించింది. వారిలో టీడీపీ నుంచి ఒకరికి, జనసేన నుంచి మరొకరికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శాసనసభ ప్రివిలేజ్ కమిటీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు స్థానం లభించింది. ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ఆచంట నియోజకవర్గానికి చెందిన పితాని సత్యనారాయణ వ్యవహరిస్తారు. పి.గన్నవరం నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణను ప్రభుత్వ ఎస్యూరెన్స్ కమిటీలో సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కమిటీకి చైర్మన్‌గా కామినేని శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. ఇద్దరు ఎమ్మెల్యేలను శాసనసభ కమిటీల్లో నియమించడం పట్ల ఆయా ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడుని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం నియోజకవర్గంలోని ఇప్పటివరకు ఏవిధమైన అభివృద్ధి జరిగిందో ఆరా తీసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రంలో అభివృద్ధి చేసిన రోడ్లతోపాటు పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్ల పనులపై సీఎంకు వివరించానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సీఎం సూచించారని ఆయన తెలిపారు. అలాగే నియోజకవర్గానికి కావాల్సిన నిధుల కోసం సీఎంకు నివేదించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.





కడలిలో పాత బోరు నుంచి ఎగిసి పడుతున్న మట్టి, నీరు.. కట్టడి చేయడానికి వచ్చిన ఓఎన్జీసీ, అగ్నిమాపక సిబ్బంది

కడలిలో పాతబోరు నుంచి..

40 అడుగుల మేర ఎగిసిపడిన మట్టి, నీరు

రాజోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలం కడలిలో ఆక్వా చెరువు వద్ద ఉన్న పాత నీటి బోరును గురువారం రైతులు పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. దీంతో భూమి అడుగు పొరల నుంచి మట్టి, నీరు 40 అడుగుల ఎత్తులో ఎగిసి పడింది. స్థానికులు వెంటనే ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. ఓఎన్జీసీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి సిమెంట్‌తో పూడ్చి అదుపుచేశారు. సంఘటనా స్థలాన్ని రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ పరిశీలించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

- జనవరి 13 నుంచి ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- జిల్లాలో రూ.51కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- అయినా ఆగని ఉపాధి పనులు
- త్వరలో విడుదలవుతాయంటూ సర్దిచెబుతున్న అధికారులు



ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు (ఫైల్)

అంబాజీపేట, మార్చి20(ఆంధ్రజ్యోతి): కనీస వేతనం గిట్టుబాటు కాకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు వస్తున్న ఉపాధి కూలీలకు గత మూడు నెలల నుంచి వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. వారానికి ఒకసారి వేతనాలు వస్తాయని పనులకు వస్తున్న కూలీలకు పస్తులు తప్పడం లేదు. సకాలంలో వేతనాలు అందక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 57 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్ణయించారు. గత ఏడాది వేతనాలు వారానికి లేదా నెలలోపు అందించినప్పటికీ ఈ ఏడాది జనవరి 13 నుంచి నేటి వరకూ ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరుకాలేదు. జిల్లాలో సుమారు రూ.52 కోట్ల మేర ఉపాధి హామీ పనులకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉందని అధికారులు అంచనా వేశారు. దీనిలో కూలీలకు 3.1 లక్షల పనిదినాలకు రూ.300 వంతున రూ.8.76 కోట్ల మేర వేతనాలు బకాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. అలాగే మిగిలినవి ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులు, గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉంది. గత మూడు నెలల నుండి ఉపాధి హామీ నిధులు అందకపోవడంతో పనులకు వెళ్లాలా లేదో తెలియని పరిస్థితి వారిలో నెలకొంది. ఇంత బకాయిలను ఒకేసారి అందిస్తారా లేదా అని ఉపాధి కూలీలకు అనుమానం వ్యక్తమవుతోంది. ఒకే కుటుంబంలో పనిచేసిన వారికి వేతనాలు అందకపోవడంతో ఆయా కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. త్వరలో వేతన బకాయిలు విడుదల అవుతాయంటూ అధికారులు ఉపాధి కూలీలకు సర్దిచెబుతున్నారు. దీనిపై ఇటీవల పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపాధి పనుల్లో అవినీతి జరిగిందన్నారు. సోషల్ ఆడిట్‌లో అధికారులు అవినీతికి పాల్పడినట్టు గుర్తించి వారిని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. అయితే ఉపాధి హామీ వేతనాలు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని, త్వరలో ఈ నిధులను ఉపాధి కూలీలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని పవన్‌కల్యాణ్ అసెంబ్లీలో వివరించారు.

లక్ష్యంకంటే పని దినాలు పెరిగాయి



ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 57 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించాం. జిల్లాలో లక్ష్యానికి మించి ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టారు. వేతన బకాయిల జాబితాను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో వేతన బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ఎస్.మధుసూధనరావు, డ్వామా పీడీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వివాహేతర సంబంధం కోసం తండ్రినే మట్టుబెట్టింది!

- ప్రియుడితో కలసి హతమార్చిన కుమార్తె
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- కుమార్తె సహా మరో ఇద్దరు అరెస్టు
- మండపేటలో ఘటన

7

అప్పుల బాధ తాళలేకే..

- కుమార్తెను చంపిన కేసులో పోలీసుల ఎదుట తండ్రి లొంగుబాటు

7



నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేయాలి : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): యువతకు ఆరోగ్యంతోపాటు ఆటపాటలు అవసరమని, అందుకు ఆటస్థలాలు, ఇండోర్ స్టేడియంలను నిర్మించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని కోరారు. తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆటస్థలాలు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మండపేటలో క్రీడా వికాస ప్రాంగణానికి రూ.రెండు కోట్లను కేటాయిస్తే తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అవుట్‌డోర్, మున్సిపల్ కార్యాలయం వద్ద, కపిలేశ్వరపురంలో ఇండోర్ స్టేడియంలు ఏర్పాటుచేయాలని కోరారు.

చెరువులు తొలగిస్తే.. చావే గతి

అధికారులను అడ్డుకున్న ఆక్వా రైతులు,. గ్రామస్తులు

- ఇప్పటికే నష్టాల్లో ఉన్నాం..
- మా పొట్టలు కొట్టవద్దు
- కలెక్టర్ కలిసి తేల్చుకుంటాం
- అవకాశమిచ్చిన అధికారులు



అంతర్వేది బీచ్‌లో ఆందోళన చేపడుతున్న రైతులు, మహిళలు



అధికారులతో మాట్లాడుతున్న మహిళా రైతులు

అంతర్వేది, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్జీటీ ఆదేశాల మేరకు సముద్ర తీర ప్రాంతంలో గత కొన్ని రోజులుగా సీఆర్‌జడ్ పరిధిలో కరవాక నుంచి అంతర్వేది దేవస్థానం వరకు 200 మీటర్ల మేర ఉన్న చెరువులను తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. మూడు మండలాల్లో సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న 486 చెరువులను ఎన్జీటీ ఆదేశాల మేరకు తొలగించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమయ్యారు. ఇది గురువారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అంతర్వేది బీచ్‌లో చెరువులు తొలగించేందుకు వచ్చిన అధికారులను ఆక్వా రైతులు అడ్డుకున్నారు. అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం, పల్లిపాలెం గ్రామస్తులు తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రాజోలు సీఐ టి.నరేష్‌కుమార్, భీమరాజు బృందాలతో ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే రైతులు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సహకారంతో రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారులతో చర్చలు జరిపారు. ముందుగా రైతులు ఆక్వా రంగంలో తీవ్రంగా నష్టపోయామని, మా ప్రాంతం భూములు చెరువులకు తప్ప దేనికీ నోచుకోదని, స్వచ్ఛందంగా క్రాప్ హాలీడే ప్రకటించుకున్నామన్నారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు చెరువులకు గండ్లు కొడితే ఆత్మహత్యలకు పాల్పడుతామంటూ పలువురు రైతులు పెట్రోల్, పురుగుల మందు డబ్బాలు చూపారు. ఇప్పటికే తీవ్ర నష్టాల బారిన పడ్డామని, ఇప్పటికిప్పుడు చెరువులకు గండ్లు కొట్టి మా పొట్టలు కొట్టవద్దంటూ మహిళలు, రైతులు ఆందోళనకు దిగారు. సుమారు నాలుగు గంటల పాటు మత్స్య, పోలీసు, రెవెన్యూశాఖలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఫిషరీస్ జేడీ శ్రీనివాస్ అమలాపురం ఆర్డీవోతో మాట్లాడారు. రైతులు కలెక్టర్‌తో మాట్లాడుకోవడానికి ఒకరోజు గడువు కోరారు. కలెక్టర్‌తో రైతులు మాట్లాడిన అనంతరం చెరువు తొలగింపు చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఏడీ సిద్ధార్థవర్మన్, సీఐలు టీవీ నరేష్‌కుమార్, భీమరాజు, ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, పి.సురేష్, రాము, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, వడుగు శ్రీను, పోతురాజు నరసింహరావు(కిశోర్), ఎంపీటీసీ బైరా నాగరాజు, అడబాల రాంబాబు, లక్కు సత్యనారాయణ, రావూరి నాగు, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, తాడి నీలకంఠం, మందపాటి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ రామకృష్ణ (నాని), అడబాల శ్రీను, తీర ప్రాంత రైతులు, మహిళలు పాల్గొన్నారు.





సంధ్య వేళ.. సొగసుల విందు!

ఆకాశమే ఓ అద్భుతం. వానకురిస్తే, మెరుపు మెరిస్తే, హరివిల్లు కనిపిస్తే ఓ అందం. ఉదయమూ అందం.. సంధ్య వేళో అందం. రాత్రికి ఆకాశమే ఓ అపురూప దృశ్యం. యానాంలో గౌతమీ గోదావరి తీరాన, యానాం- ఎదుర్లంక వారధిపైన గురువారం సాయంత్రం కనిపించిన దృశ్యాలివి.... యానాం (ఆంధ్రజ్యోతి)

హలీమ్‌కు సలాం!



రంజాన్ మాసంలో హలీమ్ ఘుమఘుమలు

హలీమ్ కోసం క్యూకడుతున్న మాంసాహారప్రియులు



కార్పొరేషన్ (కాకినాడ)/అమలాపురం టౌన్/ కల్చరల్ (రాజమహేంద్రవరం) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం వచ్చిందంటే.. నోరూరించే రంజాన్ రుచులు అందుబాటులోకి వస్తాయి.. భగభగమండే బట్టీలు, గరంగరం హలీమ్‌తోపాటు నోరూరించే తియ్యని ఖీర్, ఖుర్బానీ మిఠాయి రుచులు రంజాన్ మాసంలో భిన్న వంటకాలు దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుప్పుమంటుంటే ఆటు వైపుగా వెళ్లున్న భోజనప్రియులను అమితంగా ఆకర్షిస్తాయి. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో ఈ హలీమ్ బట్టీలు దర్శనమిస్తున్నాయి. కాకినాడలో భారీ స్థాయిలో హలీమ్ అమ్మకాలు జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి కాకినాడ వచ్చి హలీమ్ రుచి చూడడంతోపాటు కుటుంబ సభ్యులకు, మిత్రులకు పార్శిళ్లు తీసుకెళుతున్నారు. గతంతో పోలిస్తే కాకినాడ నగరంలో నాగమల్లితోట జంక్షన్, జేఎన్టీయూ, భానుగుడి సెంటర్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి సెంటర్లతోపాటు సుమారు 10 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేసి అమ్ముతుండగా, కొన్ని రెస్టారెంట్లలో హలీమ్ తయారు చేసి అమ్ముతున్నారు. రంజాన్ మాసం ప్రారంభమయ్యాక హలీమ్ సందడి మొదలవుతుంది. షమీతుక్లా, కద్దుకా ఖీర్ స్వీట్స్‌పాటు మటన్, చికెన్ బిర్యానీ, కిమా సమోసా తదితర వంటకాలు నోరూరిస్తాయి. హలీమ్‌ను మటన్, చికెన్‌తో తయారుచేస్తారు. కాకినాడలో మటన్ హలీమ్ ఫ్యామిలీ ప్యాక్ రూ.400, చికెన్ ఫ్యామిలీ ప్యాక్ రూ.300కు బాగా అమ్ముతున్నారు. ముస్లింలు అధికంగా ఫ్యామిలీ ప్యాక్‌లే తీసుకెళుతున్నారు. ఒక్కో బట్టీ వద్ద రోజుకు సుమారు 150 నుంచి 200 వరకు ఫ్యామిలీ ప్యాక్‌లు ఆర్డర్లుగా అమ్ముడుపోతుండగా, బట్టీల వద్ద రోజుకు సుమారు రెండు వందల మందికి పైగా ఈ వంటకాలు తింటున్నారు. వేకువజామున చేపట్టే ఉపవాస దీక్ష సాయంత్రం విరమించిన అనంతరం ముస్లింలు ఆహారం తీసుకుంటారు. గోధుమ రవ్వ, 15 రకాల మసాలాలతో నోరూరించే విధంగా హలీమ్ తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆజాద్ చౌక్ సెంటర్ హలీమ్ విక్రయాలకు అడ్డాగా ఉంది. వందలాది మంది ఇక్కడకు వచ్చి హలీమ్ కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాలు రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. అమలాపురంలో టౌన్ బ్యాంకు వద్ద హలీం సెంటర్ ఏర్పాటుచేశారు.

ఆరోగ్యకరం హలీమ్



హలీమ్ వంటకాన్ని ఇరానీ తరహాలో తయారుచేస్తున్నాం. ఈ వంటకంలో జీడిపప్పు, పిస్తా, శనగపప్పు, మినపప్పు, గోధుమలతోపాటు మటన్, నెయ్యి, పంచదార వంటి ఆరోగ్యకరమైన అధిక ప్రోటీన్లు ఉండే వాటిని వినియోగిస్తున్నాం. ఉదయం 8 గంటలకు హలీం తయారీ ప్రారంభిస్తే సాయంత్రానికి అందుబాటులోకి వస్తుంది. కేవలం నాన్‌వెజ్‌లోనే మటన్ మీట్‌తో హలీంను తయారుచేస్తున్నాం. సింగిల్‌ప్యాక్ రూ.150 కాగా, ఫుల్ ప్యాక్ ధర రూ.200, ఫ్యామిలీ ప్యాక్ రూ.500కు విక్రయిస్తున్నాం. అన్నివర్గాల వారిని హలీమ్ వంటకం ఆకట్టుకుంటోంది.

- మహ్మద్ ఆషిక్‌అలీ (మున్నా), హలీమ్ సెంటర్ నిర్వాహకుడు, అమలాపురం

ఉపవాస దీక్షలో డ్రై ఫ్రూట్స్, పండ్లకు ప్రాధాన్యం

రంజాన్ నెలలో ముస్లింలంతా కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తారు. పగలంతా దాహాన్ని కూడా దరికి రానివ్వరు. ఆకలికి చోటివ్వరు. ఆహారపు అలవాట్లలో ప్రత్యేకత చూపిస్తారు. ఈ నెల రోజులు డ్రైఫ్రూట్స్, పళ్లు తీసుకుంటారు. రంజాన్ ఉపవాసదీక్షలు, నమాజ్ ఆధ్యాత్మిక చింతనలతోపాటు ఆరోగ్యానందించి ముస్లింల జీవనాన్ని ఆనందమయం చేస్తాయి. సహరి, ఇఫ్తార్ సమయాల్లో తీసుకునే ఆహారం రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. మంచి శక్తిని కూడా అందిస్తుంది. దీని ద్వారా ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఉపవాసం ఉండేవారు తెల్లవారుజామునే అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, పాలు, గోధుమ రుచులు, పెరుగు, మంచినీరు తీసుకుంటారు. డ్రైఫ్రూట్స్ కూడా భుజిస్తారు.



డ్రైఫ్రూట్స్ ప్రయోజనాలు

వంద గ్రాముల జీడిపప్పుతో 596 కేలరీల శక్తినిస్తుంది. బాదంలో 250 కేలరీల శక్తి, 49 శాతం ప్రోటీన్లు ఉంటాయి. ఒక శాతం ఐరన్ లభిస్తుంది. పిస్తాలో 557 కేలరీల శక్తి, 27 గ్రాములు కార్బోహైడ్రేట్స్, 200 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. క్రిస్మిస్‌లో 290 కేలరీల శక్తి, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్ష పండ్ల ద్వారా 71 కేలరీల శక్తి లభిస్తుంది. 20 మిల్లీగ్రాముల కాల్షియం, 2.9గ్రాముల పీచు పదార్థం, 15 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది.

ఖర్జూరం ప్రధానం

ముస్లింలు ఖర్జూరాన్ని అధికంగా తీసుకుంటారు. వంద గ్రాముల ఖర్జూరంలో 234 కేలరీల శక్తి, 55 మిల్లీగ్రాముల కార్బోహైడ్రేట్లు, 18 మిల్లీగ్రాముల ప్రోటీన్లు, 76 మిల్లీగ్రాముల పీచు పదార్థాలు, 4 మిల్లీగ్రాముల సోడియం, 60.9 మిల్లీగ్రాముల పొటాషియం, ఐరన్, విటమిన్-బి పుష్కలంగా ఉంటాయి. ధర కిలో రూ.120 నుంచి రూ.180 వరకు ఉంది.

ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఆహా..

రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా చేసేది పాయసం. దీనిలో ఎక్కువగా డ్రైఫ్రూట్స్ వేస్తుంటారు. జీడిపప్పు, క్రిస్మిస్, యాలకులు, పిస్తా, బాదం, పంచదార తదితర రకాలు వేసి తయారుచేస్తారు. అందుకే ముస్లింలు చేసే ఖీర్ అంటే చాలా ఇష్టపడతారు. రంజాన్ రోజు ప్రతి ముస్లిం ఇంట ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఉండాల్సిందే. ఈ వంటకంలో హిందూ, ముస్లింల ఐక్యత కనిపిస్తుంది. రంజాన్ రోజుల్లో పాల వినియోగం అధికంగా ఉంటుంది.

- కార్పొరేషన్ (కాకినాడ)







లూయిస్ బ్రెయిలీ నాణేలు

ఈ నాణేలది ప్రత్యేక భాష!

కంటి చూపు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు..

అంధుల కోసం ముద్రించిన నాణేల సేకరణలో ఈమె దిట్ట



రాచకొండ రాజేశ్వరి

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన రాచకొండ రాజేశ్వరి అరుదైన నేత్ర వ్యాధితో కంటి చూపును పూర్తిగా కోల్పోయింది. అప్పటివరకు అందరిలా సాగిన ఆమె జీవనం ఒక్కసారిగా మారిపోయింది. మొదట్లో మానసికంగా కొంత కుంగిపోయినా అంతలోనే తేరుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగింది. ఆమెకు అండగా ప్రముఖ నాణేల సేకరణ కర్త, భర్త పుత్సా కృష్ణకామేశ్వర్ తనవంతు సహాయ సహకారాలు ఆమెకు అందించారు. 2021 కరోనా సమయంలో అరుదైన నేత్ర వ్యాధి రాజేశ్వరికి సోకడంతో ఆమె పూర్తిగా దృష్టిని కోల్పోయింది. ఆమెకు మానసిక ధైర్యాన్ని నింపడంతో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షురాలిగా పనిచేయడంతోపాటు కోనసీమ మహిళా క్లబ్ నుంచి 2023లో జరిగిన మహిళా దినోత్సవంలో మహిళా అచీవర్ అవార్డును సైతం దక్కించుకున్నారు. మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్‌క్లబ్‌గా నిలిపిన ఘనత రాజేశ్వరికి దక్కుతుంది. ఆ సమయంలోనే ఆమె అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ నాణేలను సేకరించడం ప్రారంభించారు. దేశంలో ఇప్పటి వరకు విడుదలైన రూ.2, రూ.100 బ్రెయిలీ నాణేలతో పాటు బెల్జియం, ఇటలీ దేశాలు విడుదల చేసిన ద్విలోహ నాణేలు, బ్రెయిలీ ముఖ చిత్రంతో విడుదల చేసిన వెండి నాణెం, పలావ్, అమెరికా దేశాలు 2009లో విడుదల చేసిన వెండి నాణేలు, పోలెండ్ దేశం విడుదల చేసిన వెండి నాణేలను సైతం ఆమె సేకరించారు. బ్రెయిలీ నాణేలతో త్వరలోనే ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు రాజేశ్వరి తెలిపారు.

సామర్లకోట భీమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల

ఆదాయం రూ.29.66 లక్షలు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి మహా శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.29.66 లక్షలు వచ్చిందని ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. హుండీల ద్వారా రూ.16,15,788, దర్శన టిక్కెట్ల ద్వారా రూ.7,05,960, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,12,696, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,66,215, వివిధ సేవా టిక్కెట్ల ద్వారా రూ.65,747 లభించాయి. 67 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి వస్తువులు లభించినట్టు ఈవో తెలిపారు. లెక్కింపులో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉండూరు శ్రీలక్ష్మీనారాయణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన సొమ్మును చూస్తున్న దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్

23, 24, 25 తేదీల్లో ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలో సామర్లకోట-రావికంపాడు మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం కార్యాలయం నుంచి గురువారం రాత్రి ఉత్తర్వులు అందాయి. 23, 24 తేదీల్లో గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను, 24, 25 తేదీల్లో విశాఖ నుంచి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. 22701, 22702 నంబర్లతో గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24న రెండువైపులా తాత్కాలికంగా రద్దు చేశారు.

వాసు ది గ్రేట్

ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాల్లో జాతీయ స్థాయిలో పదో ర్యాంకు కైవసం



అమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన పిచ్చిక కుమార్‌వాసు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2025 ఫలితాల్లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పదో ర్యాంకు సాధించాడు. చేనేత కార్మికులైన పిచ్చిక మల్లేశ్వరరావు-రేణుకవాణి కుమారుడు వాసు ఎంతో కష్టపడి గేట్ పరీక్ష రెండో పర్యాయం రాసి పదో ర్యాంకు సాధించాడు. దాంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వారిని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఊరేగించి వీరభద్రస్వామి ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. స్థానికులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, గ్రామ పెద్దలు ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, బోళ్ల మల్లేశ్వరరావు, కారుపర్తి భాస్కరరావు, చందన శంకరరావు, మాడా పద్మదుర్గాప్రసాద్, లక్కింశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాసు తల్లిదండ్రులు మల్లేశ్వరరావు-వాణిలను సత్కరిస్తున్న బండారులంక గ్రామస్తులు

డీఆర్డీవోలో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యం
పిచ్చిక కుమార్‌వాసు

జాతీయ స్థాయిలో గేట్ పరీక్షలో పదో ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. 1 నుంచి 4వ తరగతి వరకు బండారులంక విజడమ్ స్కూలులో చదివాను. ఆ తర్వాత భూపతిపాలెం గురుకుల పాఠశాలలో చేరాను. రాజమహేంద్రవరం శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్, నర్సరావుపేట జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. మూడేళ్లపాటు హైదరాబాద్‌లో ఇన్ఫోర్ కంపెనీలో బిజినెస్ ఎనలిస్ట్‌గా పని చేశాను. తర్వాత తమిళనాడులోని ఎన్‌సీఎల్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరా. ప్రస్తుతం ఆగ్రాలోని ఇండియన్ ఆయిల్ కంపెనీలో ఏవియేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా. గత ఏడాది గేట్ పరీక్షలో 285వ ర్యాంకు రాగా ఇండియన్ ఆయిల్ కంపెనీలో చేరాను. ఈసారి డిఫెన్స్, రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)లో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యంగా గేట్ పరీక్ష రాశా. పదో ర్యాంకు రావడంతో సైంటిస్ట్‌గా చేరేందుకు మార్గం సుగమం అయ్యింది. నా అభ్యున్నతికి పాటుపడిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు.

ఉగ్రవాదుల నుంచి రక్షణ... పారిశ్రామిక భద్రతకు

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ ర్యాలీ



సైక్లోథాన్ ర్యాలీ ప్రతినిధుల బృందానికి మెమెంటో అందజేస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించడంతో పాటు పారిశ్రామిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సీఐఎస్ఎఫ్) సైక్లోథాన్ ర్యాలీ చేపట్టాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎం రాజకుమారి పేర్కొన్నారు. దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుతూ రక్షణ చర్యలపై సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. అమలాపురం పట్టణానికి చేరుకున్న సైక్లోథాన్ ర్యాలీని గురువారం ఉదయం గడియార స్తంభంసెంటర్లో జెండా ఊపి పునః ప్రారంభించారు. ర్యాలీ నర్సాపురం మీదుగా మచిలీపట్నం చేరుకుంటుందన్నారు. గుజరాత్ నుంచి చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ కన్యాకుమారి వరకు సాగుతుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉగ్రవాదుల చర్యలను దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు బృందాలుగా సుమారు తీర ప్రాంతం వెంబడి 6,550 కిలోమీటర్ల మేర సైక్లోథాన్ యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. అదనపు ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ దేశ పారిశ్రామిక రక్షణ, ప్రజల రక్షణకు ఈ ర్యాలీ తోడ్పడుతుందన్నారు. గుజరాత్‌లో ఈ నెల 7న కేంద్ర రక్షణ మంత్రి అమిత్‌షా సైక్లోథాన్ ర్యాలీని ప్రారంభించారన్నారు. నెలాఖరునాటికి కన్యాకుమారి చేరుకుటుందన్నారు. బృంద సభ్యులకు మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో దళ డిప్యూటీ కమాండర్ ఏకే ప్రభాకర్, తహసీల్దారు పలివెల అశోక్‌ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు పాల్గొన్నారు.



మండే ఎండలో చల్లచల్లగా...

కరప, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లేలేత చిగుర్లు తొడిగిన వృక్షాలు ప్రధాన రహదారిని పచ్చదనంతో ఆవరించి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ రహదారి వెంబడి ఉన్న చెట్ల నీడలో ప్రయాణికులు కొద్దిసేపు బడలిక తీర్చుకుని వెళ్తున్నారు. ఎండలు ముదురుతున్న తరుణంలో ఈ రహదారిపై ప్రయాణం ఆహ్లాదభరితంగా ఉంటోందని పలువురు ప్రయాణికులు చెప్తున్నారు.





కరప-వాకాడ ప్రధాన రహదారిపై పరుచుకున్న పచ్చదనం

కాటేజీలు.. ఇక పరిశుభ్రంగా..

- సత్యదేవుడి సన్నిధిలో సత్రం గదుల నిర్వహణపై ఈవో దృష్టి
- మరమ్మతులు, పారిశుధ్య బాధ్యతలు ఏఈవోలకు అప్పగింత
- ఒక్కో సత్రానికి ఒక్కొక్కరి చొప్పున విభజన



ప్రకాష్‌సదన్ కాటేజీ

అన్నవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు బస చేసేందుకు వివిధ సత్రం గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చాలావరకు దశాబ్ధాల క్రితం నిర్మించినవే. కొండపైన న్యూసెంటినరీ, పాతసెంటినరీ, సీతారామ, హరిహరసదన్, శివసదన్ పేర్లతో 450 గదులు ఉంటాయి. శివసదన్ ఒక్కటే రెండేళ్లక్రితం ప్రారంభించారు. మిగిలిన సత్రం గదుల్లో పలు గదులు మరమ్మతులకు గురవడం, శానిటేషన్ సంతృప్తికరంగా లేకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపించేవి. శానిటేషన్, స్వల్ప మర మ్మతుల నిర్వహణ ప్రైవేట్ సంస్థకు టెండర్‌ద్వారా కేటాయించి శానిటేషన్ బాధ్యతలు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే కేటాయించేవారు.

బాధ్యతల అప్పగింత

తాజాగా సత్రం గదుల పారిశుధ్య నిర్వహణ, మరమ్మతుల పర్యవేక్షణకు దేవస్థానంలో ఉన్న ఏఈవోల్లో ఒక్కో సత్రం బాధ్యత ఒక్కో ఏఈవో కు అప్పగించారు. కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రం బాధ్యతలు సూపరింటెండెంట్ ఐవీ రామారావుకు అప్పగిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలిచ్చారు. వీరంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి గదులన్నీ భక్తులకు కేటాయించాలనే ల క్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్ప టికే కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఐవీ రామారావు దృష్టిసారించి కాటేజీకి సంబందించి ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సత్రం గుమసా_లు ఏ గదిలో మరమ్మతులు ఉన్నాయో చూసి సంబంధిత కాటేజీకి అప్పగించిన వారికి సమాచారం చేరవేస్తే ఆ ఏఈవో వాటిని త్వరితగతిన పని పూర్తి చేయిస్తారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్ని కాటేజీల పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. దీంతో సత్యదేవుడి సన్నిధిలో ఉన్న సత్రం గదులకు మహర్దశ పట్టి గదులన్నీ పూర్తి సౌకర్యాలతో నిండి ఉంటాయని అనడంలో సందేహం లేదు.

నేడు సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణ.. పునఃప్రారంభ దినోత్సవం

- అన్నవరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పండితులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణం పునఃప్రారంభించి శుక్రవారంతో 13ఏళ్లు పూర్తిచేసుకుని 14వఏట ప్రవేశించబోతోంది. శిథిలావస్థకు చేరిన పాత ఆలయంలో మూలవిరాట్‌లను కదపకుండా పూర్తిగా గ్రానైట్‌తో అప్పటి ఈవో, ప్రస్తుత దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ కృషితో సాధ్యమైంది. ఈ విషయంలో పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించి గుడి పునర్నిర్మాణం నిలుపుదల చేయాలని ఎత్తులు వేశారు. దీనిపై రామచంద్రమోహన్ అలుపెరగని పోరాటం చేశారు. 2010లో పాత ఆలయ గోడలు తొలగించి యంత్రాలయం ఆవరణలో బాలాలయం నిర్మించి స్వామికి ఉన్న శక్తినంతటనీ మంత్రపూర్వకంగా కలశాల్లో నింపి భక్తుల దర్శనాలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించారు. 2012లో ఫాల్గుణ బహుళ సప్తమి రోజున కంచికామకోటి పీఠాధిపతి కలశప్రతిష్ఠ గావించారు. అప్పట్నించి ప్రతిఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గర్భాలయంలో ఉన్న మూలవరులకు లక్షపత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు అవసర నివేదనలు శాస్త్రోక్తంగా చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకట నారాయణ, ఎస్‌ఐలు

అప్పులబాధ తాళలేకే..

- పిల్లలను చంపి తాను ఆత్మహత్యకు పథకం...
- మనస్సుమార్చుకుని రాథేయపాలెం బంధువుల ఇంటికి
- బంధువుల సూచనతో పోలీసుల ఎదుట లొంగుబాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద తన కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్యశ్రీ (7) మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ పిల్లి రాజును అరెస్టు చేశారు. గురువారం రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వెల్లడించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పుల బాధతాళలేక తన కుమారుడు రామ్‌సందీప్(10), కుమార్తె కారుణ్యశ్రీ(7)లను చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. ఈనెల 17న మధ్యాహ్నం ఒంటిగంటకు తన పిల్లలు చదువుతున్న భాష్యం పాఠశాల నుంచి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద ఇంజరం కాలువలోకి ఇద్దరు పిల్లలను తోసేశాడు. కుమారుడు ఈదుకుంటూ తుప్పలను పట్టుకుని ఒడ్డుకుచేరుకోగా కుమార్తె కారుణ్యశ్రీ కాలువలో మునిగి మరణించింది. పిల్లి రాజు తన మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. కుమారుడు ఇచ్చిన సమాచారంతో ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం రాజు మోటారు సైకిల్ యానాం వారధిపై గుర్తించడంతో గోదావరిలో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లి రాజు ఆత్మహత్య చేసుకోవాలని యానాం చేరుకున్నాడు. అనంతరం మనస్సు మార్చుకుని రాజానగరం మండలం రాథేయపాలెం బంధువుల ఇంటికి చేరుకున్నాడు. బంధువుల సూచనతో మండపేటరూరల్ పోలీసులకు పిల్లి రాజు లొంగిపోయాడు. ద్రాక్షారామ పోలీసులు రాజును అరెస్టుచేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ, రామచంద్రపురం ఎస్‌ఐలు లక్ష్మణ్, నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

పిఠాపురంలో జనసేన వీర మహిళపై కేసు నమోదు

పిఠాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేతతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్యనేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పిఠాపురం పట్టణానికి చెందిన జనసేన వీరమహిళ సుజాతపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడ శివారులో ఈనెల 14న జనసేన ఆవిర్భావ సభ జరిగిన తీరుపై ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులనుద్దేశించి సుజాత అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టుచేసింది. జ్యోతిప్రజ్వలనకు కొందరినే ఆహ్వానించడం తదితర అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో రెండు రోజుల క్రితం జనసేన నాయకులు పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కేసునమోదు చేసిన పిఠాపురం పట్టణ పోలీసులు రాత్రి సుజాత ఇంటికి వెళ్లారు. రాత్రి కావడంతో స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటివరకు ఆమెను అరెస్టుచేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనసేన నాయకులు మరోమారు సీఐని కలిశారు.

ఫిలిం డిస్ట్రిబ్యూటర్ రాము ఆకస్మిక మృతి



ఆకుల రాము

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా దశాబ్దాల కాలంగా వ్యవహరిస్తున్న ఆకుల రాము (62) గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందారు. సినిమా పంపిణీ రంగంలో ఎవరు ఏ సినిమా కొనాలన్నా ముందుగా రామును సంప్రదించేవారు. సినిమా రంగానికి రాము చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న మెట్ల కాలనీలో ఆయన నివాసంలోనే రాము గుండెపోటుతో మృతిచెందడంతో సినీ అభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి గిరిజనుడి మృతి

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కోతులగుట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కొంతమంది గిరిజనులు పోచవరం కాలనీ మిర్చికోతల పనులకు నెలరోజుల క్రితం వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వారు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్నారు. ఈలోగా కోతులగుట్టలో ట్రాక్టర్ టైరు పేలడంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ముచ్చిక ఎర్ర(30) అకస్మాత్తుగా కింద పడిపోయారు. దీంతో ఎర్రపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లిపోవడంతో ఎర్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అన్న సీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నాడు. మృతుడిది ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకమాజిల్లా బాబినపల్లి గ్రామం.

23న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ విద్యాసదస్సు

- ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో ఈనెల 23న ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యాసదస్సు జరుగుతుందని ఏపీయూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ వెల్లడించారు. గురువారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోంలో జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశానికి జయకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోరుబాటలో భాగంగా ప్రాంతీయ విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో తూర్పుగోదావరి జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ నాయకత్వం ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. యూటీఎఫ్ కార్యకర్త+లు మండలస్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ జీవో 117 రద్దు, పాఠశాలల విలీనాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల రూ.25,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయగౌరి, ఈవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, దయానిధి, శ్రీనివాస్, రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, వెంకటరమణ, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.25.32లక్షలు



అయినవిల్లి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 51 రోజులకుగాను ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.24,45,779 నగదు, అన్నప్రసాద హుండీ నుంచి రూ.86,484 నగదుతో కలిపి రూ.25.32లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 14 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలో గుర్తించామన్నారు. దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు నమోదు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్-బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. జీబీఎస్ బారిన పడిన ముగ్గురు బాధితులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్యకుమారి గురువారం తెలిపారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో అందు బాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

వివాహేతర సంబంధం కోసం తండ్రినే మట్టుబెట్టింది!

- ప్రియుడితో కలసి హతమార్చిన కుమార్తె
- పోలీసుల దర్యాప్తులో వెల్లడైన దారుణం
- కుమార్తె సహా మరో ఇద్దరు అరెస్టు
- మండపేటలో ఘటన



తండ్రిని ప్రియుడితో కలిసి హత్యకు పాల్పడిన కుమార్తె అమె ప్రియుడిని అరెస్టుచేసిన మండపేట సీఐ సురేష్

మండపేట, మార్చి20 (ఆంధ్రజ్యోతి): తన వివాహేతర సంబంధానికి కన్నతండ్రి అడ్డుతగులుతున్నాడని, తండ్రినే ప్రియుడితో కలిసి కుమార్తె హత్యకు పాల్పడిన దారుణమిది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల అనుమానాస్పద స్థితిలో సురారాంబాబు మరణించాడు. ఈ కేసును ఛేదించిన పోలీసులు చివరకు అతని కుమార్తె, ఆమె ప్రియుడు హత్య చేసినట్టు తేల్చారు. సూరా రాంబాబు కుమార్తె వస్త్రాల వెంకటదుర్గకు రామచంద్రపురం పట్టణం సమీపంలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై తండ్రి మందలించడంతో ఆమె తన తండ్రిపై కసిపెంచుకుంది. ఈనెల 16వ తేదీ రాత్రి తన పిల్లలను తల్లి వద్ద పడుకోబెట్టిన దుర్గ తన తండ్రి ఒంటరిగా పడుకున్నాడని తన ప్రియుడు ముమ్మిడివరపు సురేష్‌కు సమాచారం చెప్పింది. దీంతో అతడు తన స్నేహితుడు అదే గ్రామానికి చెందిన తాటికొండ నాగార్జునతో కలిసి మండపేటకు వచ్చి గాఢనిద్రలో ఉన్న రాంబాబు ఛాతీపై కూర్చుని పీకను లిమి చంపి పారిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల కోసం గాలిస్తుండగా రామచంద్రపురం నుంచి విశాఖకు పారిపోయేందుకు సిదమవుతున్న వారిని రామచంద్రపురంలో అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలియజేశారు. మండపేట పట్టణంలో ఈనెల 16న మేదరపేటకు చెందిన సురాపండు తన అన్నగారైన రాంబాబు అనుమానాస్పదంగా మరణించాడని పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదుమేరకు ఈ కేసును దర్యాప్తు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలమేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ నేతృత్వంలో కేసును ఛేదించి గురువారం ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టుచేశామని తెలిపారు. కోర్టు రిమాండ్ విధించగా వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

రైలు నుంచి జారిపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- మృతురాలిది ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్



మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుభాష్ మితా దాస్

సామర్లకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తూ కిందికి జారిపడడంతో తలకు బలమైన గాయమై ఒడిసా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగి దుర్మరణం పాలయిన సంఘటన గురువారం సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జి.మేడపాడు స్టేషన్‌వద్ద జరిగింది. ప్రమాద సమయంలో కొన ఊపిరితోఉన్న సదరు యువతిని రైల్వే ఉద్యోగులు గుర్తించి వెనుకనే సామర్లకోట వైపునకు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు లో హుటాహుటిన తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు 108 వైద్య సిబ్బంది గుర్తించారు. వివరాల్లోకి వెళితే ఒడిసా రాష్ట్రం కేంద్ర పారాజనావళి, కలాస్‌పూర్‌కు చెందిన శిబా ప్రసాద్ దాస్ కుమార్తె అయిన సుభాష్ మితా దాస్ (25) బెంగళూరులోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు బుధవారం బెంగుళూరులో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ టిక్కెట్టు ద్వారా ప్రయాణించేందుకు రైలు ఎక్కింది. రైలు గురువారం సామర్లకోట సమీపాన జీ.మేడపాడు చేరేసరికి బోగీ తలుపువద్ద నిలుచుని ఉన్న మితాదాస్ ప్రమాదవశాత్తూ కిందికి తూలి పడింది. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందింది. బోగీలోఉన్న మితాదాస్ లగేజీని పలాసవద్ద రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహంవద్ద లభించిన ప్రాథమిక సమాచారంతో భువనేశ్వర్‌లో ఉన్న తండ్రికి సామర్లకోట రైల్వేపోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు
- కోటనందూరులో ఘటన..



ట్రాక్టర్ చక్రాలకిందపడి మృతి చెందిన వెంకటేశ్వర్లు

కోటనందూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి-కాకరాపల్లి మార్గంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లిజిల్లా నాతవరం మండలం చినగొలుగుండపేటకు చెందిన కాళ్ల వెంకటేశ్వర్లు(59), బర్ల వరలక్ష్మి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ ద్విచక్రవాహ నంపై కోటనందూరులో సామాన్లు కొనుక్కోవడానికి వెళుతున్నారు. అదే దారిలో ధాన్యం లోడుతో అతివేగంగా వెళుతున్న గునిపూడికి చెందిన ట్రాక్టర్ పక్కనుంచి ఢీకొట్టడంతో వీళ్లిద్దరూ కింద పడిపోయారు. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా బర్లవరలక్ష్మికి తీవ్రగాయాల య్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

బైక్ ప్రమాదంలో చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి

మారేడుమిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైక్అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి తీవ్రగాయాలు పాలయ్యాడు. ఈ సంఘటన మారేడుమిల్లి మండలం దేవరపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రంపచోడవరం మండలం రాకోటకు చెందిన కామేశ్వరరెడ్డి తన కుటుంబంతో మారేడుమిల్లి మండలంలోని జీఎం వలస గ్రామానికి తన కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లి వస్తుండగా దేవరపల్లి సమీపంలో ఒక మలుపువద్ద చెట్టును బలంగా ఢీ కొట్టాడు. దీంతో హంసగీత(4)అక్కడికక్కడే మృతి చెందగా మరో చిన్నారి నిఖిత వర్షిణి గాయాలపాలైంది.ఈప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కామేశ్వర రెడ్డిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూనవరం రుద్రమ్మకోట రేవు వేలంపాట రూ.78.60లక్షలు



వేలంపాట నిర్వహిస్తున్న ఈవో సురేష్‌కుమార్

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కూనవ రం రుద్రమ్మకోట పడవ రేవు వేలంపాట రూ.78. 60లక్షలు పలికింది. వేలేరుపాడు మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన బీరబోయిన కోటేశ్వరరావు ఈపాటను దక్కించుకున్నారు. గత ఏడాది రూ.80లక్షలు పాట పలకగా ఈఏడాది రూ.78.60లక్షలు పలికింది. కూనవరం పంచాయతీ కార్యాలయంలో ఈ పాట నిర్వహించారు. ఈకార్యక్రమంలో కూనవరం, రుద్రమ్మకోట సర్పంచ్‌లు హేమంత్, లలితకుమారి, ఎంపీటీసీ అనంతలక్ష్మి, వైస్‌ఎంపీపీ బండారు సాంబశివరావు, ఎంపీడీవో రామాంజనేయప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కువైట్‌లో గొందివాసి మృతి



కువైట్‌లో గుండెపోటుతో మృతిచెందిన చింతా సాగర్

అంతర్వేది, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన చింతా సాగర్(34), 18వ తేదీన కువైట్ దేశంలో గుండెపోటుతో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రెండు రోజులకు కువైట్ దేశం నుంచి సాగర్ పనిచేస్తున్న శేట్ ఫోన్‌చేసి వివరాలు తెలిపినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సాగర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. 2022లో కువైట్ దేశం వెళ్లిన సాగర్ 2024 జనవరిలో వచ్చి తిరిగి మళ్లీ జూలై నెలలో వెళ్లినట్టు తెలిపారు. జీవనోపాధి కోసం వెళ్లిన సాగర్ మరలా తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు సాగర్‌కు గుండెపోటు వచ్చిందన్న మరణవార్త విని ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కువైట్ దేశంలో డ్రైవింగ్ చేసుకుంటూ నిద్రమత్తులోనే గుండెపోటుతో మరణించిన సాగర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కరప ఎస్‌ఐ తోటసునీత తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సాధన(28)కు ఎనిమిదేళ్ల క్రితం కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామ శివారు వై.సావరానికి చెందిన కోరం రాజశేఖర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహమైనప్పటి నుంచీ రాజశేఖర్ సాధనను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త వేధింపులు భరించలేక సాధన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పటి నుంచీ కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారంరాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.

ఆదరణ-3 ప్రణాళికలపై సమావేశం
రాజోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంవీ సత్యనారాయణ అధ్యక్షతన చేతి వృత్తుల కుల సంఘాలతో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. చేతివృత్తిదారులకు ఏ పనిముట్లు కావాలో, రేట్లు మొదలగు సమాచారం వారి వద్ద తీసుకున్నామని తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన
రాజోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెరకపాలెం గిడుగువారిపాలెంలో గిడుగు ప్రకాష్ ఇంటి వద్ద నుంచి గిడుగు వెంకటేశ్వరరావు స్వగృహం వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.6లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ గిడుగు బుజ్జి గురువారం శంకుస్థాపన చేశారు.

ఎస్సీల తాజా జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ జరగాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



మామిడికుదురు: తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాలమహానాడు నాయకులు

మామిడికుదురు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల తాజా జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయాలంటూ మాలమహానాడు నాయకులు గురువారం తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులకు వినతిపత్రం అందజేశారు. ఈనెల17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయడానికి కేబినెట్ తీర్మానం చేసిందని, వాస్తవాలకు వ్యతిరేకంగా ఎస్సీల్లో ఉన్న 59కులాల జనాభా లెక్కలు తేల్చకుండా ఒన్ మెన్ కమిషన్‌వేసి మాలలకు పూర్తిగా అన్యాయం చేశారని, దీనిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్ రిపోర్టును రద్దుచేసి హైకోర్టు రిటైర్డ్ జడ్జిలతో త్రిసభ్య కమిషన్‌వేసి మాలలకు, 29 ఎస్సీ కులాలలకు న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బొంతు మణిరాజు, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, పిల్లి శ్రీను, నీతిపూడి మహేష్, బత్తుల శేఖర్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయం తగదు
ఉప్పలగుప్తం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగాని బూటకపు జనాభా లెక్కలతో ఎస్సీ వర్గీకరణ అన్యాయమని మాలమహానాడు వ్యాఖ్యానించింది. గురువారం తహశీల్దార్ వాసా శామ్యూల్ దివాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కొంకి వెంకటబాబ్జి, కుంచే బాబులు, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, గెల్లా రాజేంద్ర, పోతుమూడి రవి, సాపే రమేష్, మెండి డేవీడ్‌అంబేడ్కర్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మాకే విజయ్, పోతుల సత్యనారాయణమూర్తి, దేవరపల్లి రాంబాబు, మాకే కృష్ణమూర్తి తదితరులున్నారు.

వర్గీకరణ నిలుపుదల చేయాలి
కాట్రేనికోన, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్‌చేస్తూ మాలమహానాడు నాయకులు గురువారం కాట్రేనికోన గేట్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు నిరసన వ్యక్తంచేశారు. రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషనర్ తప్పుల తడక నివేదికను ప్రభుత్వానికి అందించిందన్నారు. కమిషన్ కేవలం మాలలను అణగదొక్కాలనే కుట్రతోనే పనిచేసిందన్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు న ల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతరావు, గెల్లా రాజేంద్ర, వడ్డి శ్యామ్‌ప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, వజ్రపు శరత్, ఇసుకపట్ల రాంబాబు, జగడం బాలయోగి, గిడ్ల శ్రీనివాస్, నందిక శ్రీను, కన్నీడి వెంకటరమణ, జనిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లాకుల వద్ద 6.5 అడుగుల నీటిమట్టం ఉండాలి

నీటిసంఘాల సభ్యులు, రైతుల నిరసన



లాకులు వద్ద నీటిసంఘం సభ్యులు, రైతుల నిరసన

పి.గన్నవరం,మార్చి20(ఆంధ్రజ్యోతి): పలివెల లాకులు వద్ద నీటి మట్టం 6.5 అడుగులు ఉండేలా చూడాలని అవిడి డీసీ పరిధిలోని నీటి సంఘం సభ్యులు, రైతులు పలివెల లాకులు వద్ద గురువారం నిరసన చేపట్టారు. కాల్వలో కనీస నీటిమట్టం లేకపోవడంతో వంతులు సమయంలో ఇచ్చే నీరు శివారు ప్రాంతాలకు వెళకుండానే గడువు ముగుస్తుందన్నారు. మళ్లీ వంతు రావాలంటే 14రోజులు పడుతుందని, నీరు అందని చేలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాకులు ఎగువన కనీస నీటిమట్టం (6.5)లేకపోవడంతో వంతులు సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో నీటి మట్టం ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అవిడి డీసీ చవల జగన్నాదం, నీటీ సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు, రెడ్డి తాతాజీ, సభ్యులు కాకిలేటి రామకృష్ణ, సిద్దయ్య, యనమదల సాయిబాబు, నాగరాజు, రైతు పేరిచర్ల నాగరాజు పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందులు ఉండవు:
సాగునీటి విషయంలో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు ఉండవని ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ అన్నారు. అంబాజీపేట చానల్ పరిధిలో ఇబ్బందులను నీటి సంఘం సభ్యులు మా దృష్టికి తీసుకువచ్చారని, దీనిపై సంబంధిత ఈఈ, డీఈతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వంతు సమయం సరిపోకపోతే మరో కొన్ని గంటలు పెంచి సాగునీటిని ఇస్తామన్నారు. లాకులు పైనే కనీసం నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయాల రేషనలైజేషన్ విధానానికి మద్దతు



డీఆర్వో రాజకుమారికి వినతిపత్రం అందజేస్తున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలు

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియకు జిల్లాలోని డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా ఎటువంటి పదోన్నతులు లేకుండా ఉన్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలకు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లుగా, అర్హత కలిగిన గ్రేడ్-1 వీర్వోలకు ఆర్ఐలుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ డిపార్టుమెంటులో లేదా ఇతర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులు ఇవ్వాలని డీఆర్వోకు వివరించారు. కార్యక్రమంలో విప్పర్తి శ్రీనివాస్, మంగ సత్యవతి, చంద్రశేఖర్, నరసింహారావు, కోమలి, రాము, దర్శ, సునీల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'అనగనగా ఆస్ట్రేలియాలో' విజయవంతం కావాలి



కేక్ కట్‌చేయిస్తున్న బాలబాలాజీ యువజన సంఘ సభ్యులు

రాజోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శహరణ క్రియేషన్స్ బ్యానర్‌పై రాజోలుకు చెందిన బొక్కా తారక రామ శ్రీనివాసరావు నిర్మించి రచన, దర్శకత్వం వహించిన 'అనగనగా ఆస్ట్రేలియాలో' చిత్రం ఈనెల 21వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా 200 థియేటర్లలో విడుదలవుతుంది. ఈ సినిమాలో హీరో జ్యోతినాథ్‌గౌడ్, హీరోయిన్ శాన్య భట్నాగర్ నటించారు. ఈ సందర్భంగా రాజోలు నాగార్జున స్ట్రీట్‌కు చెందిన బాల బాలాజీయువజన సంఘం ఆధ్వర్యంలో 'అనగనగా ఆస్ట్రేలియాలో' సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్థానిక పీఆర్ మార్ట్ వద్ద యువజన సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన కేక్‌ను డైరెక్టర్ తారకరామశ్రీనివాసరావు తండ్రి సత్యనారాయణచే గురువారం కట్ చేయించారు. ఈ సందర్భంగా రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజోలుకు చెందిన ఇరిగేషన్ డిపార్టుమెంట్ మాజీ ఉద్యోగి బొక్కా సత్యనారాయణ కుమారుడు తారకరామశ్రీనివాసరావు నిర్మించి దర్శకత్వం వహించిన అనగనగా ఆస్ట్రేలియాలో తొలిచిత్రం ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం విడుదల కావడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువకుడైన డైరెక్టర్ తారకరామ శ్రీనివాసరావును ప్రేక్షక దేవుళ్లందరూ ఆదరించాలని కోరారు. సినిమా ట్రైలర్ చాలా బాగుందని అనగనగా ఆస్ట్రేలియాలో చిత్రం సూపర్‌డూపర్ హిట్ అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన పరమేశ్వరరావు, బొంతు సత్యనారాయణ, అప్పారి గుణ, యిళ్ల నాని, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ హజరత్ అలీకి ఘననివాళి
మామిడికుదురు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆరాధ్య దైవం ఇమామ్ హజరత్ అలీ సంతాప కార్యక్రమంలో భాగంగా మామిడికుదురు షియా జామియా మసీదులో ముస్లింలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మసీదులో మత ప్రబోధకుడు షబ్బర్ అలీ జైదీ మస్లిస్ ఆలపించారు. కూపా పట్టణంలోని మసీదులో నమాజు ఆలపిస్తున్న హజరత్‌అలీపై జరిగిన దుండుగల దాడిని భక్తులు తీవ్రంగా ఖండించారు. ఖురాన్‌ను శిరస్సుపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా నగరం, మొగలికుదురు మసీదుల్లోను, పెదపంజీషలోను ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అధిక సంఖ్యలో పాల్గొని హజరత్‌అలీకి ఘన నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తికి గాయాలు
ముమ్మిడివరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలేనికి చెందిన ఎం.వీరవెంకటసత్యనారాయణ టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా వైజాగ్ నుంచి అమలాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు పల్లిపాలెం సమీపంలో గురువారం అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడ్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ
అంబాజీపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీల ఆసుపత్రి సమీపంలోని దొమ్మేటి వారిపాలెం వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికంగా ఉన్న శ్రీకృష్ణుడి ఆలయ మెట్లను కూడా లారీ ఢీకొట్టడంతో మెట్లు ధ్వంసమయ్యాయి. అలాగే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ధ్వంసం కాగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపు
అమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై పేరూరు వై.జంక్షన్ వద్దనున్న ఆక్రమణలను గురువారం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్నతాత్కాలిక దుకాణాలన్నింటినీ తొలగించారు. పర్మినెంట్‌గా నిర్మించిన షెడ్లకు కొంత సమయం ఇచ్చి అనంతరం తొలగించాలని తహశీల్దార్ ఆదేశించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం
అంబాజీపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు ఈనెల 22వ తేదీ వరకు స్వీకరిస్తామని ఎంపీడీవో జీవీ సరోవరరావు తెలిపారు. స్వయం ఉపాధి, మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు రాయితీతో కూడిన రుణాలు అందిస్తామన్నారు.

50లక్షల ఎకరాల ప్రకృతి వ్యవసాయం లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు

అల్లవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రంలో 50లక్షల ఎకరాలు ప్రకృతి వ్యవసాయంగా మార్చాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. అల్లవరం మహిళా సమాఖ్య భవనం వద్ద ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయశాఖ, డీఆర్డీఏల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం పూర్తిగా క్షీణిస్తుందని, దాని ప్రభావం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం సాగుచేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఏపీ సీఎఫ్ఎఫ్ ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ జీవామృతం, ఘనజీవామృతం, ప్రకృతి పద్ధతిలో తయారుచేసిన కషాయం వల్ల పంటల్లో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునన్నారు. ఏడీఏలు రాజశేఖర్, ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారులు ఎస్వీవీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్, సర్పంచ్ బొమ్ము బాలవేణి, పాటి సింహాద్రి, ఎం.ఉదయభాస్కరరావు, సూరిబాబు, సుభగణేష్ పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి : ఆర్డీవో



అన్న క్యాంటీనులో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మాధవి

ముమ్మిడివరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో మెనూను తప్పనిసరిగా పాటించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని అన్న క్యాంటీన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన పారామీటర్ల వారీగా నిర్వహణ ఉన్నదీ లేనిదీ విషయాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ప్రాంతం స్వచ్ఛమైన తాగునీరు ఏర్పాట్లు, పరిసరాలు పరిశుభ్రత, ప్లేట్ల శుభ్రతను ఆమె నిశితంగా పరిశీలించారు. క్యాంటీనులో పెడుతున్న రూ.5 భోజనాన్ని రుచిచూసి నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీకి వినియోగించే సరుకులను పరిశీలించారు. భోజనం చేసేందుకు వచ్చే కూలీలు, ఆటోరిక్షా నడిపేవారు. వివిధ ప్రాంతాల నుంచి పనులపై వచ్చిన వారితో ఆర్డీవో మాట్లాడి భోజనం ఎలా ఉందని పరిశీలించారు. అన్నం, పప్పు, ఒక కూర, చట్నీ ఇస్తున్నారని, భోజనం బాగుందని వారు తెలిపారు. కార్యక్ర మంలో తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి
అయినవిల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.భీమారావు అన్నారు. అయినవిల్లి మండలపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగానికి ఇస్తున్న రాయితీలను వ్యవసాయాధికారి వై.శోభ వివరించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కొబ్బరి తోటల్లో కోకో పంటను అంతరపంటగా వేసుకోవడానికి ఇస్తున్న రాయితీలను ఉద్యానాధికారి ప్రసన్నలక్ష్మి వివరించారు. నేదునూరులో డ్రైనేజీ పనుల గురించి స్థానిక ఎంపీటీసీలకు చెప్పలేదని, ఎంత మేర అంచనాలతో పనులు నిర్వహిస్తున్నారో చెప్పాలని సభ్యులు ప్రశ్నించారు. మడుపల్లి, తొత్తరమూడి, వీరవల్లిపాలెం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు స్థలం లేదని పంచాయతీ విస్తరణాధికారి బెహరా వాణి తెలిపారు. సంపద కేంద్రాలకు స్థల సేకరణ చేస్తామని తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. 2025-26 బడ్జెట్‌కు అంచనాల ఆదాయ, వ్యయాలను, 2025-26 బడ్జెట్‌కు అన్నిపద్దుల ఆదాయం రూ.63,32,60,000 కోట్లు, అన్ని పద్దులకు వ్యయం రూ.68,32,30,600 కాగా మిగులు బడ్జెట్ రూ.29,400ను ఆమోదించారు. కళ్లేపల్లి సుబ్బరాజు, బొబ్బా ప్రభాత్‌కుమార్, సలాది బుచ్చిరాజు, వారా జయసావిత్రి, కోనే సునీతసుబ్బలక్ష్మి, కాశి వీరవెంకటసత్యనారాయణ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

18 బైకుల సీజ్
అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాల వద్ద రవాణశాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కిమ్స్‌లో మెడికల్ చదువుతున్న 18మంది మోటారుసైకిళ్లను సీజ్ చేసినట్టు జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేకుండా ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్నట్టు తనిఖీల్లో గుర్తించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, బైకుల మీద కళాశాలకు వచ్చే ప్రతీ విద్యార్థి విధిగా లైసెన్సు, హెల్మెట్ కలిగి ఉండాలని డీటీవో సూచించారు. త్వరలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈతనిఖీల్లో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు
అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు జాగ్రఫీ పరీక్ష నిర్వహించారు. 9మంది విద్యార్థులకు తొమ్మిది మంది హాజరయ్యారు. పరీక్షలు తప్పినట్టయితే విద్యార్థులు ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా ఉండాలని, అందుకు తల్లిదండ్రులు వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాజోలుకు చేరిన సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ
రాజోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ గురువారం చేరుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ర్యాలీని చేపట్టిన దళ డిప్యూటీ కమాండర్ వీకే ప్రభాకర్ బృందానికి స్వాగతం పలికారు. ఈసందర్భంగా కమాండర్ ప్రభాకర్ మాట్లాడుతూ తీరప్రాంతాల్లో జాతీయ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు ఎన్.రాజు, కృష్ణమూర్తి, వరప్రసాద్, డాక్టర్ బి.మధుకుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

28న తపాలా అదాలత్
అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికై ఈనెల28న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ తెలిపారు. 28వ తేదీ ఉదయం 11గంటలకు అమలాపురంలోని హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో తపాలా అదాలత్ నిర్వహిస్తామన్నారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే అదాలత్‌లో చర్చిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు తమ ఫిర్యాదులను తపాలా అదాలత్ శీర్షికతో 21వ తేదీ సాయంత్రంలోగా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, అమలాపురం డివిజన్-533201 చిరునామాకు పంపిచాలన్నారు.ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా తపాలా అదాలత్‌కు హాజరు కావచ్చునన్నారు.

'స్మార్ట్ మీటర్లతో రీడర్స్ ఉపాధికి గండి'
ఐ.పోలవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో స్మార్ట్ మీటర్లను వినియోగంలోకి తీసుకురావడంతో విద్యుత్ రీడర్స్ ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ట్రాన్స్ కో ఈఈకి వారు వినతిపత్రం అందజేశారు. సంస్థను నమ్ముకుని 23ఏళ్లుగా ఎంతోమంది రీడర్లు కుటుంబాలను పోషించుకుంటున్నారని, స్మార్ట్ మీటర్లతో వారి పరిస్థితి సందిగ్ధంలో పడిందన్నారు. వారి కుటుంబాలకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఆరేళ్లలోపు పిల్లలకు బాల్యారంభ విద్య
ఐ.పోలవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల లోపు పిల్లలకు నాణ్యమైన బాల్యారంభ విద్యతో పాటు సంరక్షణను అందించేందుకు పోషణ్ బి పడాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విస్తరణాధికారిణి సీహెచ్ నాగలక్ష్మి తెలిపారు. కొమరగిరిలో గురువారం సర్పంచ్ వరసాల విజయచాముండేశ్వరి, ఎంఈవో ఎన్.కొండారెడ్డి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 70అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు, మూడేళ్ల లోపు చిన్నారులకు నవచేతన, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్‌శిల విద్యావిధానాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈనెల20 నుంచి 22వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సహవిస్తరణాధికారిణి జె.మీనాక్షి పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం
మలికిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధికి ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు.గురువారం మలికిపురం భూపతివారిపేటలో అమరవీరుల స్థూపం వద్ద సమావేశం నిర్వహించారు. అమరవీరులైన కందికట్ల నాగభూషణం, అల్లూరి బుచ్చిరామరాజు, రాపాక సూర్యనారాయణ, గుర్రం వెంకటరెడ్డి, దొంగ నరసింహమూర్తి, గుబ్బల వెంకటరెడ్డిలకు నివాళులర్పించారు. దేవ రాజేంద్రప్రసాద్, దేవ సురేష్‌బాబు, దీపాటి గంగాచలం, పుల్లెల ఆనంద్, వై.వెంకట్, బత్తుల రవిప్రసాద్ పాల్గొన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం
ముమ్మిడివరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులు స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా మంచి మార్కెట్ లభిస్తుందని, తద్వారా లాభాలు ఆశించవచ్చునని కమిషనర్ పి.రవివర్మ, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం చైర్మన్ ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటుచేసిన చీరలు, పంజాబీడ్రస్సులు, జ్యూట్ బ్యాగులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, 1గ్రామ్ గోల్డ్ ఆభరణాల స్టాల్స్‌ను వారు పరిశీలించారు. ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, మెండి కమల, అసిస్టెంట్ ఇంజనీర్లు పీవీ సుధాకర్, కె.శ్రీనివాస్, సీఎంఎం భాస్కర్, సీవో రాజేశ్వరి, ఆర్పీలు, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ నుంచి విద్యావిజ్ఞాన విహారయాత్ర ప్రారంభం
అమలాపురంటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యావిజ్ఞాన విహార యాత్రను చేపట్టినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు విహారయాత్ర బస్సులను ప్రారంభిస్తారన్నారు. 131 మంది విద్యార్థులు, 20మంది ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళతారన్నారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఈయాత్ర దోహద పడుతుందన్నారు. యాత్రలో భాగంగా తిరుపతిలోని ఐఐటీ, రీజనల్ సైన్స్ సెంటర్, జూలాజికల్ గార్డెన్, చంద్రగిరికోట వంటి ప్రముఖ విద్య, శాస్త్ర, సాంస్కృతిక ప్రదేశాలను సందర్శిస్తారన్నారు. అనంతరం జిల్లాలోని కోరింగ అభయారణ్యాన్ని సందర్శిస్తారన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన, టెక్నాలజీ అభివృద్ధి వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించేలా చేపట్టిన విజ్ఞానయాత్ర ఈనెల22తో ముగుస్తుందన్నారు.

వైసీపీ హయాంలో రీసర్వే లోపాలు చక్కదిద్దాలి



భీమనపల్లిలో భూ రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన భూరీసర్వేలో అనేక తప్పులు జరిగాయని, ప్రస్తుత రీసర్వేలో వాటిని చక్కదిద్దాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామంతో పాటు ఎంపీటీసీలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. భీమనపల్లిలో తహశీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్ ఆధ్వర్యంలో గురువారం రీసర్వేపై భీమనపల్లి, మునిపల్లి గ్రామాల్లో అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. రీసర్వే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామ సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మండల సర్వేయర్ నవీన్, వీఆర్వోలు మహదశ బాబి, అవిడి రాము, మంచెం బాబి, గొలకోటి తాతాజీ, మంచెం బాబి, ఆకేటి వెంకన్న, చీకట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని వినియోగించుకోవాలి
ముమ్మిడివరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం-3లో భాగంగా బీసీ కులవృత్తుదారులు, చేతివృత్తుల పనివార్లకు సబ్సిడీతో బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో రజక, నాయీబ్రాహ్మణ, పేయింటర్స్, వెల్డర్స్, ఎలక్ట్రీషియన్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయా వృత్తులకు సంబంధించిన యూనిట్ల పేర్లను నగరపంచాయతీ కార్యాలయంలో నమోదుచేయించుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఫ్రీ ట్రైనింగ్ కోర్సులు ప్రారంభం
ముమ్మిడివరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్, ఫ్రీట్రైనింగ్ కోర్సులు త్వరలో ప్రారంభిస్తామని, శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. వీకేవీడిగ్రీ కళాశాల నుంచి వీటికోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. వివరాలకు9000831156నుసంప్రదించాలన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో విక్టరీ విద్యార్థుల ప్రతిభ
అమలాపురంటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం వీఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్‌లో విక్టరీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు అకాడమీ ప్రిన్సిపాల్ తాడి వెంకటసురేష్ తెలిపారు. జిల్లానలుమూలల నుంచి 133మంది క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. విక్టరీ అకాడమీ విద్యార్థులు ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ స్థానం సాధించి రూ.3వేలు, అరిగెల జయప్రకాష్ ద్వితీయస్థానం సాధించి రూ.2వేలు, తాడి సాయి వెంకటేష్ తృతీయ స్థానం సాధించి రూ.వెయ్యి అందుకున్నారు. వీరితో పాటు సాధనాల శ్రీసంతోష్, బండారు నానిబాబు, అడబాల ప్రావీణ్యశ్రీలు వరుస స్థానాలు సాధించి నగదు బహుమతులను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్ నుంచి అందుకున్నారు.

అంగాడి సత్తెమ్మ తల్లి జాతర



కొలువైన సత్తెమ్మతల్లి అమ్మవారు

కె.గంగవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దంగేరు శివారు వాసాలరేవులోని అంగాడి సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాలు మొత్తం ఐదు రోజుల పాటు జరుగుతాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

29న లలిత విజయదుర్గమ్మ జాతర

రాయవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక శివారు నదురుబాద-పసలపూడి కూడలిలో ఉన్న విజయ కనకదుర్గ మ్మవారి జాతర ఈనెల 29న నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ గురువారం తెలిపింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతరను పురస్కరించుకుని గరగ నృత్యాలు, భజన, ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధనలు ఉంటాయన్నారు. 30న ఉగాది పండగను పురస్కరించుకుని తీర్థం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. స్థానికులతోపాటు పరిసర ప్రాంతాల వారు రావాలన్నారు.

దివ్యాంగుల స్కూల్‌కు ఆర్థిక సాయం



సంస్థ ప్రతినిధులకు సొమ్ము అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని శుభోదయం దివ్యాంగుల స్కూల్ హాస్టల్‌కి పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ. 5,275ను విరాళంగా అందజేశారు. సేకరించిన డబ్బును సంస్థ ప్రతినిధులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'గేట్'లో కుందూరు విద్యార్థికి 142వ ర్యాంకు



గోపి సత్యనిశాంత్

కె.గంగవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గేట్ పరీక్షా ఫలితాల్లో కుం దూరు విద్యార్థి గోపి సత్య నిశాంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఆల్ ఇండియా స్థాయిలో 142వ ర్యాంకు సాధించాడు. అలాగే ఇంటర్‌లో 976 మార్కులు వచ్చాయి. తర్వాత జేఈఈ మెయిన్స్‌లో 563వ ర్యాంకుతో ఐఐటీ ఇండోర్‌లో సీటు పొందాడు. రూ. 20 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం చేశాడు. అనంతరం ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఆ ఉద్యోగానికి స్వస్తి పలికి ఏడాదిగా ప్రిపేర్ అవుతున్నాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిశాంత్‌ను గ్రామస్థులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఎమ్మెల్యే చొరవతో ఏడిద రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

మండపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండపేట ఏడిద దుళ్లరోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఈసీ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చొరవతో అడుగుపడింది. ఈ పనులకు రూ. 30 లక్షలు మంజురైనా కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దాంతో ఎమ్మెల్యే ఇటీవల జిల్లా పరిషత్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. అయితే ఎట్టకేలకు గురువారం రోడ్డుపనులు ప్రారంభించడంతో వారంతా కాస్త ఊరట చెందారు.

రామాలయ వార్షికోత్సవం

కె.గంగవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): దంగేరు చెరువు గట్టు ప్రాంతంలో వెలసిన రామాలయంలో గురువారం ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

● జిల్లా ఎక్సైజ్ అధికారి కేడీవీ ప్రసాద్



ద్వారపూడిలో నవోదయ 2.0 గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారులు

మండపేట, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్. కేడీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం ద్వారపూడిలోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లోని విద్యార్థులకు నవోదయం 2.0పై అవగాహన కల్పించారు. కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మ ణ్యం అధ్యక్షతన జరిగింది. ఇందులో సారా వల్ల కలిగే అనర్థాల గురించి ఆయన వివరించారు. అనంతరం రూరల్ సీఐ పి.దొర్రాజు మాట్లాడు తూ విద్యార్థులు చిన్నతం నుంచే మద్యం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వ రరావు మాట్లాడుతూ సారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలు చదువుకునే వయసులో మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. మండపేట రూరల్ ఎస్‌ఐ బుజ్జిబాబు మాట్లాడుతూ సారా తయారీని అరికట్టేందుకు యువత ముందుకు రావాలన్నారు. అనంతరం నవోదయ 2.0 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలమూరు ఎక్సైజ్ ఎస్‌ఐ రాంబాబు, స్వామిప్రసాద్, రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



అంగర ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. చైర్‌పర్సన్ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత సమావేశంలో కమిటీ ఆమోదించిన వివిధ పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై తీర్మానం చేసి ఆమోదించారు. మెరుగైన సేవలందించడంలో అంగర పీహెచ్‌సీకి ఫిబ్రవరి నెలలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం లభించడం పట్ల వైద్యాధికారి రత్నకుమారి, సిబ్బందిని అభివృద్ధి కమిటీ చైర్మెన్, సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో రత్నకుమారి, వైద్యాధికారిణి రత్నకుమారి, పడమరఖండ్రిక గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, మండలపరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

28న తపాలా అదాలత్

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదుల పరిష్కారానికై ఈ నెల 28న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ తెలిపారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

● సత్యశ్రీ రోడ్డులో అడ్డుకున్న స్థానిక వార్డు మహిళలు



ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వార్డు మహిళలు

మండపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గీత కార్మికులకు మంజూరైన మద్యం దుకాణాన్ని సత్యశ్రీ రోడ్డులో వున్న సప్తగిరి థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు గురువారం సిద్ధమవుతుండగా, స్థానిక వార్డు మహిళలు వచ్చి అడ్డుకున్నారు. తమ ఇళ్ల దగ్గర ఏర్పాటు చేయటం తగదంటూ ఆందోళన చేశారు. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పట్టణ ఇన్‌చార్జి ఎస్‌ఐ చంటి, ఏఎస్‌ఐ చిన్నారావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించినా ఫలితం లేకపోయింది. దీంతో దుకాణం ఏర్పాటు నిలిచిపోయింది. అనంతరం మహిళలంతా స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ చంటికి ఫిర్యాదు చేశారు. ఇబ్రహీం, మురళి, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాసరావు, వార్డు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి : ఆర్డీవో



ఆర్డీవోకు సమస్యలను వివరిస్తున్న రామారావు

కపిలేశ్వరపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూసర్వేకు రైతులంతా సహకరించాలని రామచంద్రపురం ఆర్డీవో అఖిల అన్నారు. గురువారం టేకి పంచాయతీ కార్యాలయంలో భూ రీసర్వే ప్రాజెక్టుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పిదాలను సరిచేసి, రికార్డులను సక్రమంగా తయారుచేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సర్వే అధికారులు పిలిచిన వెంటనే రైతులు స్పందించి భూవివాదాల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తమ వద్ద నున్న రికార్డుల ప్రకారం భూ సర్వే నిర్వహించి అప్పగించనున్నట్టు డీఐఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇదిలావుండగా నెలరోజుల పాటు సర్వేను వాయిదావేయాలని రైతులు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. గ్రామసర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, నాయకులు దాసరి శ్రీనివాస్, నెక్కంటి బుచ్చిరామారావు, మేడిశెట్టి శ్రీనివాస్, తదితరులు, తహశీల్దార్ చిన్నారావు, ఆర్‌ఐ అర్జమ్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్. శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజ నిర్మాణానికి కృషి

» ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక

» రాజవరంలో నవోదయం 2.0



రాజవరంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనరు రేణుక

ఆత్రేయపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సారా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు వి.రేణుక, కోనసీమ జిల్లా ఎక్సైజ్ సూపరింటెంట్ ఎస్‌కేడీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాజవరంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జాన మంగాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో డ్వాక్రా మహిళలు, విద్యార్థులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సారా మహమ్మారిని తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేస్తున్న ఈ మహమ్మారిని తరిమికొడదామన్నారు. రాజవరం, పేరవరం, వెలిచేరు గ్రామాల్లో సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సూపరిండెంట్ ప్రసాద్ తెలిపారు.సారా తయారీ, విక్రయాలు జరిపితే సమాచారం అందించాలన్నారు. ఎక్సైజ్ సీఐ కాత్యాయని, దత్తత అధికారి కె.అన్నవరం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని వసూళ్లు

» రెండు సెంట్ల భూమికి రూ.1.50 లక్షలు

» హౌసింగ్ శాఖ ఉద్యోగి బంధువులే పాత్రదారులు

» ఎమ్మెల్యే బండారుకు, అధికారులకు బాధితుల ఫిర్యాదు

రావులపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని కొత్తకాలనీలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని పలువురు డబ్బులు వసూలు చేసి ఆనక మోసం చేశారని బాధితులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక కొత్తకాలనీలో గతంలో కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వాటిలో కొంత మంది ఇళ్లు నిర్మించుకోగా, ఇళ్లు నిర్మించకుండా ఉన్న ఖాళీ స్థలాలను ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేశారని బాధితులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈతకోటకు చెందిన యర్రయ్య, భరత్, శివప్రసాద్‌లు పలువురి వద్ద నుంచి రెండు సెంట్ల భూమికి రూ.1.50 లక్షల నగదు ఇస్తే స్థలం ఇస్తామని వసూలు చేశారన్నారు. వీరిలో యర్రయ్య ఇటీవల మృతిచెందాడు. అయితే భరత్, శివప్రసాద్‌లు హౌసింగ్ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి బంధువులని ఆరోపించారు. దీనిపై హౌసింగ్ ఏఈ జేజుబాబును వివరణ కోరగా ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి గృహనిర్మాణ శాఖకు ఎటువంటి సంబంధంలేని బాధితులు ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు.

జనసేన నాయకుడు 'బండారు' పుట్టినరోజు



ఆలమూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రావులపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పుట్టినరోజును పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా రావులపాలెంలో అంధుల పాఠశాల విద్యార్థులకు, రహదారి చెంతనే నివసించే వారికి, పేదలకు ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి, అంబటి కిషోర్, గాయత్రి ప్రసాద్, గీదా వెంకటేష్, వెత్సా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలమూరు: జనసేన మండలాధ్యక్షుడు సూరపురెడ్డి సత్య ఆధ్వర్యం లో ఆలమూరు బస్‌స్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి చేశారు. మిఠాయిలు పంచారు. మండపేట ప్రత్యేక ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ అంధుల పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంచారు. కార్యక్రమాల్లో గారపాటి శ్రీనివాస్‌చౌదరి, నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్, శిరిగినీడి పట్టాభి, వెంకటేశ్వరరావు, డీపీ రావు, దాసి మోహన్, గుత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1688 లీటర్ల అక్రమ మద్యం ధ్వంసం



రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పోలీస్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని గు రువారం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన వివిధ రకాల మద్యం 92 కేసులు, 3906 సీసాల్లో 16 88 లీటర్లు ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం

ద్రాక్షారామ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం అన్నాయిపేటకు చెందిన ఇంటర్ విద్యార్థి శంకర్‌కు కాపు ఐక్యతా గ్రూపు సభ్యులు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అన్యం శ్రీరామ్ చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో కాపు ఐక్యతా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు



చల్లగరగ రూపంలో అమ్మవారి గ్రామోత్సవం

ఆలమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కొత్తపూల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారికి మన్యసీమ నుంచి తీసుకొచ్చిన మోదుగపూలను పెద్దగరగకు అలంకరించి బుధవారం రాత్రి నాలుగో విడత కొత్తపూల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, గరగనృత్యాలు, కోయి నృత్యాలు, విచిత్ర వేషధారణ భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా చల్లగరగ రూపంలో ఉన్న అమ్మవారు గ్రామోత్సవం ద్వారా ఇంటింటికి దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

బడుగువానిలంకలో వైభవంగా కర్లమ్మ తల్లి జాతర

ఆలమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడుగువానిలంక గ్రామ దేవత కర్లమ్మ తల్లి జాతర పాతూరులో బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అమ్మవారిని రెండేళ్లకోసారి గ్రామంలోకి తీసుకువచ్చి జాతర నిర్వహిస్తారు. గ్రామంలోని పాతూరు, కొత్తూరులలో జాతరను విడిగా నిర్వహిస్తారు. అనంతరం ఆలయంలోకి తీసుకెళ్తారు. సోమవారం కొత్తూరులో జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అడబాల వారి ఆడపడుచుగా దూలం వారి అత్తింటిగా అమ్మవారిని కొలుస్తారు. బుధ వారం రాత్రి నిర్వహించిన జాతరలో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు మధ్య శక్తి వేషాలు తదితర ప్రదర్శనలతో జాతర సందడిగా జరిగింది.

25 నుంచి శ్రీవారి అధ్యాయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యాయనోత్సవాలు ఈ నెల 25 నుంచి 29 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి వారం రోజుల పాటు స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా అధ్యాయనోత్సవాల్లో ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ సింహ వాహన సేవలు ఆళ్వార్ల గ్రామోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అష్టోత్తర పూజలు ఉదయం 9గంటలు, 10గంటలు జరుగుతాయని, స్వామివారి ఆలయంలో జరిగే నిత్యకల్యాణం రద్దు చేసినట్టు ఈవో చెప్పారు.


ఇసుక ట్రాక్టర్ సీజ్

ఆత్రేయపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన్నట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. నార్కెడిమిల్లిలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదరణ పథకంపై కులవృత్తిదారులతో సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి20(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణంలో ఆదరణ పథకం-3 అమలుపై గురువారం పట్టణంలో కులవృత్తి సంఘాలు, నాయకులతో కమిషనర్ అయ్యప్ప నాయుడు సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ఆదేశాల మేరకు కులవృత్తిదారులతో సమావేశంలో ఆయా కులవృత్తులకు కావలసిన ఆధునిక పరికరాల వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మేనేజరు మూర్తి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.85 లక్షలు



ఆత్రేయపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,85,154 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.